

# రెండు రెక్కలవాడు

వాకాటి పాండురంగారావ్

"అబ్బా!" అని ఆశ్చర్యంలో పడ్డారు శౌనకాది మహా మునుల వంటి శ్రోతలు.

రేడియోలో హిందీ పాటలు మొదలయ్యాయి

ఆ శ్రోతలలో కంసు (కందాళపాలెం సుబ్బరాముడూ,) డాక్టరగా, వాల్‌రస్ మీసాలూ, పురుషోత్తమూ ఉన్నారు రెండవ శనివారం పొద్దుట ఆది బ్రహ్మవారి చలపతి ఇంట్లో అందరూ సమావేశమయి రవ్వ ఉప్మా చేయించుకుని తింటూ, మధ్య మధ్య 'ఇన్‌స్టెంట్—కాఫీ' త్రాగుతూ, వక్కపొడి నములుతూ, సిగరెట్లు తగలేస్తూ వివిధ భంగిమలలో ఆ రేడియో గదినిండా వ్యాపించిన వారయి ఉండిరి

అసలు ఉప్మా అధ్యాయాత్పూర్వం వాల్‌రస్—మీసాలు ఆఫీసులో తన ప్రమోషన్ ఏవిధంగా వెనక్కుపోతున్నదీ వర్ణించి గోలపెట్టాడు అంతట—కంసుడు పాత పత్రిక తిరగవేసి పాముల నిచ్చెన వేసుకుని పై వెగబాకిన పీతాంబరం కథను పఠించాడు

ఆ కథ ముగియగానే "దీని తరువాయి భాగం తెలుసునా?" అని అడిగాడు చలపతి

"తెలియదు!" అన్నాయి అందరి మొహాలూ.

"లండన్ వెళ్ళొచ్చిన తర్వాత—రెండు నెలల్లోపుగా పీతగారి జీతం నెలకు ఐదు వందల యాభై నుండి ఆరువందలు అయింది ఆ అవడం కూడా వెనకటి రెండేళ్ళనుండి అయింది"

"నిజంగానే—?" అన్నాడు వాల్‌రస్ మీసాలు

"పచ్చేంత నిజం."

"మరి ఘోరంగా ఉందే! అయినా 'రెట్రాస్పెక్టివ్ ఎఫెక్ట్'తో ఎట్లా సాధించాడయ్యా?" అని జుత్తు పీక్కున్నాడు పురుషోత్తం ఇట్లా పీక్కుని పీక్కునే అతడు 24 వ ఏటికే బోలెడు బట్టతల సాధించాడని చెప్పుకుంటారు

"ఎవరివో ఫోటోలు తీసి ఉంటాడు" అని సూచించాడు కంసుడు

"కాదు" అన్నాడు చలపతి పడకకుర్చీలో చేరగిలబడి చూరువైపు చూచాడు "అబ్బే, కంసనాథం! ముందిది తెలుసుకో అందరి దగ్గరగా ఒకే 'టెక్నిక్' పని చెయ్యదు అందువలన కీలెరిగి వాత పెట్టాలి అనగా ప్రథమంగా మన లక్ష్యమేమిటో నిర్ణయించుకుని, దాన్ని ప్రసాదించగల దేవుడిని తెలుసుకుని, ఆ దేవుడికి దారి ఏదో పరిశోధించి— అప్పుడిక కూర్చుని క్షుణ్ణమైన 'ప్లాన్' రచించాలి అటుపిమ్మట వరందేముంది కాస్త ముందూ వెనకగా వచ్చితీరుతుంది....."



"వ్వా పేరా మరీ గంభీరంగా ఉంది" అంటూ సిగరెట్టు వెలిగించాడు పురుషోత్తం

"వివరిస్తాను వినండి! జీతం పెంచాలి ఇది లక్ష్యం జీతాన్ని పెంచివేవాడు ఫలాని దేవుడు అని అనుకోవాలి ఇది లక్ష్యానికి రాజమార్గం, ఇక మూడవది సాగని ఫలానా దేవుడికి దారి ఏదో—దానిని సాధించాలి ఆ ఒరిజినల్ దేవుడిని చేరాలంటేనే భక్తి జ్ఞాన వైరాగ్యాలవంటి మార్గాలనేకం ఉన్నాయంటారు అల్లాగే ఫలానా దేవుళ్ళకూ దారులున్నాయి అందులో పాటలు పాడడం ఒక దారి, ఫోటోలు తీయడం ఇంకో దారి, దర్శనం చేసుకోవడం ఒకదారి, దానాలివ్వడం ఇంకోదారి అర్పించడం ఒక దారి, అర్పించేసుకోడం ఇంకో దారి మాటల మాలలు—అల్లడం ఒక దారి, మూటలు మోయడం ఇంకోదారి ఈ అష్టమార్గాలలో ఒక దానిని ఆ దేవుడికి ఎరిపడిన దారిని ఎన్నుకోవడం నీ చాతుర్యం అది నీ నైపుణ్యం సరే, ఇప్పుడు ఈ కోర్టువారి ముందున్న కేసు చూద్దాము ఈ సందర్భంలో పీత తెనాలిలో ఒక బామ్మగారివద్దకు వెళ్ళి చేరాడు'

నోటి సిగరెట్టు నేల రాలగా—" "తెనాలికి! ఢిల్లీనుండి! ఎవరో ఒక బామ్మకోసం!!!" అని మెల్లవారిగా ఆశ్చర్యపడ్డాడు డాక్టరు

"డాక్టరూ! ఆ ఆరు ఆశ్చర్యార్థకాలలో ఒకటి దనవసరం" అని కత్తెర ప్రయోగించాడు దిన పత్రికలో సహాయ సంపాదకుడయిన చలపతి వివరించసాగాడు

'ఆ బామ్మ దగ్గర కెట్లాగో వెళ్ళి చేరిన పీత - "బామ్మగారూ, బామ్మగారూ మరేమో నేను ఢిల్లీవాణ్ణి ఢిల్లీలో మీ అమ్మాయీ వాళ్ళు బాగున్నారు మీ మనవడు ఝుమ్మున బడికి వెళ్ళిపోతున్నాడు—" అనేశాడు

"కళ్ళజోడు తగిలించుకుని నేతి ముసుగు సవరించుకుని బామ్మగారు ఈ శాల్తీని పరకాయించి చూసి "నాయనా! మా అమ్మాయీ, అల్లుడూ ఢిల్లీలో బాగున్నారన్న విషయం నిన్ననే పత్రికలో చూశాను కాని నాకు ఒక్క మనవరాలే ఉందిగాని మనవడేలేడే? అదీగాక ఆ గుంట ముండకు మూడేళ్ళయినా నిండనిదే బడికి ఎట్లా వెళ్తుంది చెప్మా—!" అని విస్తుపోయింది

"హిహ్హి! సరే బామ్మగారూ! ఈకాలపు పిల్లలు మ్మన్నాయి చూశారూ వీటివల్లా మానవ జాతిలో ఆడ ఏదో మగ ఏదో తేల్చుకోవడం కష్టమయి పోతుందంటే నమ్మండి!"

"అవున్నాయనా, ఉర్కి పోయేకాలం వచ్చేసింది దేశానికి"

"బాగా చెప్పారండి! మరీ మూడేళ్ళకే బడేవి టున్నారుకదూ? అదీ ఒక ఫేషనే! ఎటొచ్చీ మీ మనవడు—అదే మనవరాలు నిజంగా బడికి వెళ్ళి పోవడంలేదుగాని, సంచి ఒకటి భుజాన తగిలించుకుని మాటి మాటికీ ఎడికి వెళ్తానంటూ బయల్దేరుతుందిట—ఆ మాటే చెప్ప వచ్చా నిందాక" అని సర్ది చెప్పాడు పీత

"నా తల్లీ! నా బంగారే! మా చిట్టికి ఎంత తెలివో, ఎంత తెలివో!"

"అంతా వాళ్లమ్మ పోలికలున్నాయండీ! ఆవిడ, మీ అమ్మాయిగారున్నారే ఎంత తెలివి ఎంత మర్యాదా "ఛీ ఛ్ఛీచ్ఛీచ్ఛో! అంతా మీ సేవకడ అనుకోండి"

తలావూచారు బామ్మగారు

"మాటల సందర్భంలో బామ్మగారూ, మీ అమ్మాయి నాతో చెప్పారు (ఎపుడు చెప్మా! దీపావళి ముందు రోజు కాబోలు)—మీరుష వత్తులు మహా బాగా చేస్తారుష మీరు చేసినంత నాజూకుగా, గట్టిగా అందంగా వత్తులు ఇంకెవరూ చేయర్ట నిజంగా మీ వ్రేళ్లలోనే ఆ నైపుణ్యం ఉన్నట్టుందిస్మండీ!"

"ఆ, నా పిండం!" అని ముసుగు ఇంకొంచెం ముందుకు లాక్కుంది బామ్మగారు "కూచో కుండానే మాట్లాడుతున్నావబ్బాయ్ కూచో మరి! దాహానికి కాస్త నీరు మజ్జిగ ఇచ్చేదా—'

"అబ్బే అవన్నీ ఎందుకండి? మీలాటి పెద్దల ఆశీస్సులుంటే అదే చాలండి" అని తల వంచి బామ్మగారి పాదాల ముందరి నేలను స్పృశించి కళ్ళకద్దుకున్నాడు పీత

"నా నాయనే! ఎంత బుద్ధిమంతుడివే! ఏమిటో, ఈ కాలంలో నీలాగా వినయమూ విధేయతా గల కుర్రవాళ్లే లేరబ్బాయి కూచో వస్తా!" అని ఆమె లోపలికి వెళ్ళింది

ఇహ తన జీతం పెరిగినట్లే అని పీతకు తెలుసు నెలకు యాభై చొప్పున 24 నెలలకు ఎన్ని రూపాయలు అని ఎక్కాలు వల్లించసాగాడు

రెండు నిముషాల తర్వాత ఒక పళ్లెంలో రెండు కజ్జికాయలూ, గ్లాసులో మజ్జిగ తెచ్చింది బామ్మగారు

కజ్జికాయలూ మజ్జిగ సేవించి, ఆ పూటకు అక్కడనుండి నిష్క్రమించి మరుసటిరోజు మళ్ళీ అవతరించి, ఇంకో గంటసేపు బామ్మగారి వత్తులను, నాల్గింటి కజ్జికాయలను మజ్జిగను ఘనంగా మెచ్చేసుకుని, ఆమెచేత వాళ్ళమ్మాయికో ఉత్తరం రాయించి, అది పట్టుకుని ఢిల్లీకి వచ్చేసి అమ్మాయిగారికి ఆ ఉత్తరాన్ని అందజేస్తే ఆ అమ్మాయిగారు వాళ్ళ అమ్మను గురించి బోలెడు కబుర్లు చెప్పిన ఈ కుర్రవాడిని గురించి వాళ్ళాయనకు చెప్పగా ఫలానా దేవుడయిన వాళ్ళాయన ఒకవారం తర్వాత తన ముందుకొచ్చిన కాగితంమీద 'ఎస్!' అన్నారు

ఆ "ఎస్" ఫలితంగానే రెండేళ్ళ వెనకనుండి పీత జీతం నెలకు యాభై చొప్పున పెరిగింది అని ముగించాడు చలపతి "

"అబ్బా!" అని ఆశ్చర్యంలో పడ్డారు శౌనకాది మహామునులవంటి శ్రోతలు

రేడియోలో హిందీ పాటలు మొదలయ్యాయి ఈలోగా వంటవాడు వేడి వేడి ఉప్మా తీసుకొచ్చాడు అందరూ అటు మళ్ళారు పంచదారతో కొందరు ఆవకాయతో కొందరూ, నిమ్మపండు రసం కలుపుకొని కొందరూ ఉప్మా తిన నారంభించారు సభాసదులు ఉప్మా సేవిస్తుండగా, పీతాంబరంవంటి మేధావికేదయినా మంచి బిరుదు ఇవ్వాలని అన్నాడొక సభ్యుడు అవునవునన్నారందరూ ఈశబ్ద కార్యక్రమాన్నేమీ వినిపించుకోకుండా అతి తీవ్రమైన ఏకాగ్రతతో రెండు ప్లేట్ల ఉప్మా తర్వాత మూడవ దానిని ...ప్పుడు ... ముందుంచుకున్న చలప సూతమునివలె పలికాడు

"అయ్యలారా! మీరు హడావిడిపడి బిరుదిచ్చేయకండి! తత్పూర్వం తాడిని తన్నేవాడి త దన్నే వాడి కథ వినదగునెంతైన—" అన్నాడు

అని ఉప్మాలో అల్లం ముక్క న స్పై ప్రక్కన ఉన్న కాఫీలో అద్దుకుని దాన్ని న లాడు కంసుడిని చూసి కళ్ళెగర వేశాడు నా దస్ మీసాలు

"ఎవడు వాడు? ఏ మా కథ" అని ప్రశ్నించాడు డాక్టరు ఆ పూటకు ఇరవై రెండవ సిగరెట్టు ముట్టిస్తూ

తీరా మూడవ ప్లేటు ఉప్మా ముగిసింతర్వాత కొంచెం కాఫీతో గొంతు తడిపి, వేరు సెనక్కాయలు రెండు నమిలి గొంతు సవరించాడు చలపతి

"వాడు రెండు రెక్కలవాడు! మూడేళ్ళలో జీతం రెండు వందల రూకలనుండి పంద్రెండు వందలకు పెరిగిన కథకు నాయకుడు!" అని వే సెనక్కాయలున్న కాగితపు సంచిని కంసుడి కంది చాడు చలపతి

సదస్యులందరూ వారు వారు చేస్తున్న పనులను మానేసి కళ్ళు పెద్దవిచేసి, చెవులకు పదును పెట్టి కూర్చున్నారు

చలపతి ఆరంభించాడు

"వీడి పేరు ఇంద్రజిత్తు అనుకుందాము గుమాస్తాగా జీవితంలోకి అడుగు పెట్టిన ఈ గాడికి చిన్నప్పటినుండి ఆశలూ, ఆశయాలు దండిగా ఉండేవి అవి మనసులోనుండి జీవితంలోకి రావాలంటే నీతీ, నిజాయితీ అన్న ముళ్ళ కంచెలు అడ్డు రాగలవని తెలుసుకున్నాడు. వాటిని తొలగించ నిశ్చయించాడు ఆనాటినుండి అతడు పెరగ నారంభించాడు

ఒకా నొక శనివారంనాడు పొద్దున దిన పత్రికలో పడిన ప్రకటన చదివాడు ఇంద్రజిత్తు అందులో ఒక ఉద్యోగం—'డిప్యూటీ' మేనేజరు అనబడినది, నెలకు 450 రూపాయల జీతం గలది అతడిని ఆకర్షించింది ఆ ఉద్యోగానికి కావాల్సిన చదువులు, అర్హతలు అనుభవాలు ఏవేవో నాలుగంగుళాల సేరా నిండా ఉన్నాయికాని, అతడు వాటి విషయం పట్టించుకోలేదు అందుకే అతడు 'పెద్ద' వాడవసాగాడూ అని చెప్పాను

సరే!

డిప్యూటీ మేనేజర్ ఇరవై ఏడవ శాఖలో. దీనికి దేవు డెవరు? అని ఆలోచించాడు ఇంజి. టెలిఫోను డైరెక్టరీ తీసుకుని ఆ దేవుడి చిరునామా రాసుకున్నాడు మర్రోజు ఆదివారం. ఇంజి వినాయకరావుగారింటికి వెళ్ళాడు

"రావోయ్ రా! నేనే నీ దగ్గరను రావాలనుకుంటున్నా" అన్నారు వినాయకరావ్ సోఫామీద నుంచి లేస్తూ

"అబ్బెబ్బె, మీరు కూచోండి! మా ఆఫీసుకు టెలిఫోన్ చేయిస్తే నేను వచ్చి వాలేవాడినిగా" అన్నాడు ఇంజి ఇంకో సోఫాలోకి వాలుతూ ఆ గది గోడలమీద ఉన్న పటాలు నిశ్శబ్దంగా నవ్వసాగాయి.

"ఏమీ లేదోయ్. ఇదుగో, ఈ 'మొసొపొ—

ఇండియా మైత్రి సంఘం ' వాళ్ళ వార్షికోత్సవం ఎల్లుండిట నన్ను అధ్యక్షుడిగా పిలిచారు!' అని వసిగారు వినాయకరావ్

"దాందేం ఉందిలెండి—రేపీపాటికి ఇచ్చేస్తాను మీకు"

"ఆరు పేజీలుంటే చాలు, అంత కన్న వద్దు ముఖ్యంగా వెనుకటి శతాబ్దాలలో మన దేశాల మధ్య ఎట్లాంటి సంబంధాలున్నాయో కాస్త చూడు మన దేశపు కుండ పెంకు వాళ్ళ రాజధానిలో దొరకడం, వాళ్ళ భాషలో ఒక పుస్తకం తిరుపతి లైబ్రరీలో ఉండడం, లాటి అంశాల మీద 'ఎంఫసైస్' చేయాలి—"

"అట్లాగేలెండి! మీ పద్ధతి నాకు తెలియదా—బ్రహ్మాండమయిన ఒకటో రకం 'స్పీచి' ఇస్తాను మీకు"

"అచ్ఛా అచ్ఛా! ఇంతకూ ఈ మొసాల్టా దేశం ఎక్కడ ఉందన్నావూ పసిఫిక్ ఖండంలోనా?"

"కాదండీ పసిఫిక్ మహా సముద్రం మధ్య సొమాల్టా ద్వీపం ఉంది ఈ మొసాల్టా దేశం అంటార్టికా ఖండంలో ఉంటూంది మొన్నీమధ్యనే స్వాతంత్ర్యం వచ్చింది కూడాను—"

"మరే! అవునవును లదేదో డెలిగేషన్లో వెళ్ళినప్పుడు ఈ దేశాన్ని చూచినట్లున్నాను—"

చిరునవ్వుతో తల వూచాడు ఇంజి

వినాయకరావ్ దీర్ఘాలోచనలో పడ్డారు సోఫా విడిచి ఇటు అటూ పచారు చేయసాగారు ఇంజి కూడా లేచి గోడవారగా నిల్చున్నాడు

రెండు నిముషాల తర్వాత వినాయకరావు అన్నారు. "అదే ఆ 64 వ శాఖలో ఖాళీ వచ్చేట్టుందోయ్ ఎపుడు వస్తుందా అని చూస్తున్నా విన్న వర్సింగ్‌హామ్‌కు ఫోన్ చేస్తే చంద్రవర్ధన్ కేసు కాస్త గొడవగానే ఉందన్నాడు, ఆ డాక్టరు"

'వోహో!' అన్నట్లు తల వూచాడు ఇంజి

"ఇవాళ పొద్దున నేనే వెళ్ళి చూసి వచ్చా చంద్రకు ఒంటిమీద స్పృహ లేదు" అని అర నిమిషం ఆగి అన్నా రాయన—"చంద్ర తర్వాత

# రెండు రెక్కలవాడు

ఆ శాఖలోకి వెళ్ళాలని ఆలోచన ఏర్పాట్లన్నీ చేశాననుకో—"

"చాలా మంచిదండి ఆ శాఖలో మీలాటి ధీశాలులూ, ధర్మరాజులూ ఉంటేనా, అది ఈపాటికి ఎంత విస్తరించి ఉండేదనీ!" అని పెదవుల్ని నాలుకతో తడిపాడు ఇంజి

తల వూచారు వినాయకరావ్

"తప్పక మీ రయిపోతారులెండి"—అని వినాయక రావుగారి దగ్గరసా వచ్చి—"చంద్రవర్ధన్ కొచ్చిన జబ్బుకు మన దేశంలో మందుల్లేవుట—" అని గ్యారంటీ ఇచ్చాడు ఇంజి

"ఆ శాఖలోకి వెళ్ళిపోతే ఒక్కసారి మన దేశం వైపు 'ట్రిప్పు' వేసుకుని శ్రీశైలమూ, తిరుపతి వెళ్ళి వచ్చేస్తాను"

"అబ్బా! ఏం మత సహనమండీ మీది—" అని మెచ్చుకున్నాడు ఇంజి

—కాస్సేపు తర్వాత, తాను వచ్చిన పని విషయము మాట్లాడకుండానే, అక్కడినుండి వచ్చేశాడు ఇంజి సోమవారంరోజు ఆఫీసుకు సెలవు పెట్టాడు ఒకటి, రెండు పుస్తకాలు తిరగ వేశాడు మొసాల్టా దేశం గురిచి రెండు పేజీలూ, మన దేశంమీదొక పేజీ, స్నేహం, బాంధవ్యం పునాది భవిష్యత్తు వంటి పదాలు పేజిన్నరా, ఖాళీస్థలం ఒక పేజీ కలిపి మొత్తం అయిదారు పేజీల 'స్పీచి' తయారుచేసుకుని, రాత్రి రాత్రి దానితోబాటు వినాయకరావ్ ఇంటికి వెళ్ళాడు

ఆ 'స్పీచి' చదివి వినాయకరావు బ్రహ్మానందరా వయిపోయారు "భేష్!" అని వీపు తట్టారు

ఆ వీపు స్వంతదారుడయిన ఇంజి ఇదియే అదను అని తెలుసుకుని శనివారం దినపత్రికలో వచ్చిన డిప్యూటీ మేనేజర్ ఉద్యోగం విషయం చెప్పాడు

"ఒహో! ఇంతకూ ఏం క్వాలిఫికేషన్ కావాలంటాడూ?" అని అడిగారు వినాయకరావ్ 'స్పీచి' ని మడిచి డ్రాయర్లో పెడుతూ

"లెక్కల బి ఎస్సీ కావాలిట" అని నసిగాడు ఇంజి

"ఐస్సీ! నువ్వేమిటి, ఎసెల్సీ అయిందా?"

"అదేవిటండీ, పీ యూ సీ లో రెండు పార్ట్సయిపోతేనూ" అన్నాడు ఇంజి తన 'డిగ్నిటీ' దెబ్బతిన్న స్వరంతో

"వో యబ్బో! పీయూసీ అయిందేం!! ఇహనేం అడ్వాన్సు, ఇంక్రిమెంట్లు లడగవచ్చు"

"మీ దయ!"

"ఇంతకూ ఆ శాఖ ఏవిటీ—"

"ఇరవయ్యేడండీ"

"ఇరవయ్యేడా, ఎవరిదబ్బా?"

"శాక్యసింహవర్మ అని"

"వోహో, వర్మనా? ఫరవాలేదు నే చెబుతాలే. రేపు క్లబ్బులో కలుసుకుంటాను, అప్పుడు చెబుతా—వర్మ మంచివాడు తప్పక చేసి పెడతాడు"—

—సరే, ఏతావాతా ఎట్లాగయితేనేం, మండలం లోపుగా ఇంజి డిప్యూటీ మేనేజరయి కూచున్నాడు.

["ఆ ఉద్యోగం జీతం ఎంత?" అన్నాడు కంసుగు

"జీతం నాలుగు వందల ఎనభై అనుకో. అలవెన్సులూ అవీ కలిపి ఆరువందల దాక వస్తాయి"

"అయితే ఇది 'ఇంటర్వెల్' అన్నమాట" అన్నాడు పన్నెండు వందల జీతం కథ వింటున్న డాక్టరు

చలపతి వంటవాడిని కేకేశాడు వనస్పతి డబ్బా తీసుకురమ్మన్నాడు అందరూ ఆశ్చర్యపోయారు. డబ్బా వచ్చింది న్యూస్‌పేపర్‌ని టేబిల్‌మీద పరచి దానిమీద డబ్బాని తిరగపోశాడు చలపతి

అందరూ బిస్కెట్లు నమలసాగారు


చలపతి మళ్ళీ మొదలుపెట్టాడు

"ఆరువందల పడిలో పడ్డ ఇంజి జీవన విధానం మారింది అవివాహితుడే అయినా నెలకు 200 రూ లు అద్దె ఇచ్చి ఒక బంగళా తీసుకున్నాడు. ఇంటిని పెళ్ళిపందిరిలా అలంకరించాడు ఒకటి రెండు గదుల్ని మెత్తగా, మత్తుగా మరింతగా పెళ్ళికూతురిలా అలంకరించి ఉంచాడు రేడియోగ్రాము, టెలిఫోన్, రెఫ్రిజిరేటర్ వంటి సౌకర్యాలు ఏర్పరచాడు

అక్కడినుండి నెలకొకసారన్నా తన ఇంట్లో 'పార్టీ' లివ్వడం ఆరంభించాడు

పార్టీలంటే రెండు ఆవడలూ, ఇంత కారప్పూసా, వో కప్పు కాఫీ ఇచ్చి అరగంటలో ఇంటికి పంపేసే పార్టీలు కావు ఇంజి ఇచ్చేవి ఘాటయిన పార్టీలు డబ్బు నీరుగా ఖర్చయే పార్టీలు మనిషి ఆలోచన గాలిగా తేలిపోయే పార్టీలు భుక్తాయాసంతో, పానాయాసంతో కదలలేనివాళ్ళంటే వాళ్ళ విశ్రమింప విడిదినిచ్చే పార్టీలు విడిదిలో ఏకాంతం భరించలేని వారికి ఏ కాంతయో 'కంపెనీ' ఇవ్వగల పార్టీలు

. ఇక చూచుకోండి! ఇంజి పరపతి పెట్రోలు పోసిన మంటలా పెరిగింది సంవత్సరం తిరిగేలోగా, 'అనుభవించడానికే జీవితం, అందుకు అడ్డం వచ్చేదంతా నాన్సెన్స్' అని నమ్మేవాళ్ళెందరో ఇంజి ఇచ్చే పార్టీలకు ఆవురావురుమని



ఎదురుచూడడం మామూలయింది జీవితంలో తాను ఏర్పరచుకున్న నిర్ణయం ఇంతటి సత్ఫలితాల నివ్వడం చూచిన ఇంజి అశ్వమేధయాగానికి పూనుకున్న చక్రవర్తిలా ఉప్పొంగిపోయాడు జటిలమైన లెక్కకు సరైన సమాధానాన్ని సులభంగా కనిపెట్టిన వాడివలె ఉత్సాహంతో నిండిపోయాడు

సరిగ్గా పదునాలుగునెలల తర్వాత ఇంజివున్న ఆఫీసులోనే, అవతలివైపు శాఖలో ఒకపెద్ద ఉద్యోగం 'జే ఏ ఒ' అన్న పేరుగలది ఖాళీ అయింది ఇరవైమంది ఇంజనీర్లు, ఇద్దరు డాక్టర్లూ, ఎనభైమంది గుమాస్తాలూ ఉన్న పెద్ద విభాగాన్ని నడపాల్సిన బాధ్యత గల ఉద్యోగం అది దానికి ఎం ఏ ఉండాలన్నారు. ఇంకా ఏదో డిప్లొమా అన్నారు అయిదేళ్ల అనుభవం అన్నారు

ఆ ఉద్యోగానికి 'పై పెద్ద' అయిన పరంజోతిగారు ఇంజికి గాఢమిత్రులు కనుక ఇంజి ఒక చొక్కా విడిచి ఇంకొకటి తొడుక్కున్నంత సులభంగా ఈ క్రొత్త ఉద్యోగంలోకి వెళ్లిపోదామని అనుకోవడంలో ఆశ్చర్యంలేదు ఎటొచ్చి 'రూల్స్' అనే క్షుద్రదేవత లేడిశాయిగా, వాటికి మహానైవేద్యం బదులు ఇన్ని అక్షింతలయినా పడేయాలి ఆ పడేయడం పరంజ్యోతి గారికి కూసు విద్య ఆ విద్యను మళ్లీ ఒకసారి ప్రయోగించ ప్రారంభించారాయన

మొదటి అంశం, ఆ ఉద్యోగం ఖాళీ అయిన విషయం పత్రికలలో ప్రకటింపబడకుండా చూడడం పత్రికల కెక్కితే దేశపు ఏ మూలలో ఏ గ్రద్ద ఉన్నదో, ఉద్యోగాన్ని ఇది తన్నుకు పోతుందో ఏమో ? కనుక పత్రికలదాకా ఈ ఖాళీ విషయం వెళ్లకుండా చేయాలి ఈ చేయడాన్ని చాల చాకచక్యంతో చేశారు పరంజ్యోతి 'మన శాఖలోనే ఇందుకు అర్హులయినవా రెందరో ఉన్నారు గనుక ఈ ఉద్యోగాన్ని ప్రకటించి తద్వారా డబ్బు ఖర్చుపెట్టడంవలన మూడవ ప్రణాళిక ఖర్చు పెరగడం తప్ప మరొక లాభం ఉండదు అందువలన డిపార్టుమెంటల్‌గానే ఒక సర్క్యులర్ పంపితే సరిపోతుంది—' అని ఆ ఫైల్‌మీద రాసేశారు పరంజ్యోతి

సర్క్యులర్ రెడీ చేయించారు ఉద్యోగానికి దరఖాస్తులు పెట్టుకోవడానికి ఆఖరి రోజు మేనెల అయిదవ తారీఖు— అన్నారు ఆ శాఖోద్యోగులున్న రెండు మూడు బయటి బ్రాంచ్‌కు ఆ సర్క్యులర్‌ను త్వరగానె పంపించారు గాని, ఆ నగరంలోనే రెండుమైళ్లవతల ఉన్న వారి శాఖకే చెందిన సూపరింటెండెంట్ కార్యాలయానికి దానిని మే 3 వ తారీకు దాక పంపలేదు

ఎందువలన ?

ఆ సూపరింటెండెంట్ ఆఫీసులో సూర్యశేఖరం అన్న మనిషి ఉన్నందున ఆ మనిషికి ఈ ఖాళీ అయిన ఉద్యోగానికి కావలసిన అర్హతలన్ని ఉన్నందున

కాని సూర్యశేఖరం అన్నవాడు కాస్త చురుకయినవా డవడంవల్ల ఈ ఖాళీ విషయం మిత్రుల ద్వారా తెలియగానే తన దరఖాస్తు, సర్టిఫికెట్ కాపీలు వగైరా సరుకునంతా సిద్ధంగా ఉంచుకుని మే మూడవ తారీకు పొద్దున తమ ఆఫీసుకు ఆ సర్క్యులర్ వచ్చిన అరగంటలో, వాటిని సూపరింటెండెంట్ వారికి అందించేశారు

అందించి సూర్యశేఖరం బయటికొచ్చిన అయిదో నిముషానికి, సూపరింటెండెంట్ ఫోన్ చేశారు "ఏందోయ్ ! అనుకున్నంతా అయింది"

"ఏమిటి, వాడు కాగితాలన్నీ ఇచ్చేశాడేమిటి ?"

"ఆహా ! పన్నెండు సర్టిఫికెట్లూ, ఆ విషయం మీద ఏవో రెండు పుస్తకాలు రాశాడట అవీ ఇచ్చాడు అంతా కలిపి రెండున్నర కిలోగ్రాములకు తక్కువ ఉండదని నా అనుమానం" అన్నారు సూపరింటెండెంట్

"అబ్బా !! అయితే మరి " అని రెండు నిముషాల మౌనం తర్వాత ఇంజి ఒక సలహా ఇచ్చాడు సూపరింటెండెంట్‌గారికి

మొత్తంమీద మే నాలుగవ తారీఖున సూర్యశేఖరం దరఖాస్తు పరంజ్యోతిగారి ఆఫీసు చేరే సరికి దానిమీద— "ఈ సూర్యశేఖరం అన్న కుర్రవాడు అఖండ ప్రజ్ఞావంతుడు ఈ ఆఫీసుకు మూల స్తంభం వంటివాడు ఇతడు లేకపోతే ఆఫీసు దెబ్బ తింటుంది కనుక ఒకవేళ, దరఖాస్తు పెట్టుకున్న ఈ ఉద్యోగానికి ఎన్నుకున్నా, ఇతడిని విడిచి పెట్టడం కష్టమవుతుంది—ఇట్లు తమ విధేయుడు, సూపరింటెండెంట్" అన్న తాత్పర్యం గల మాటలు రాసి ఉన్నాయి !

ఒకడు : మీారు డాక్టరవ్వాలని ఉందా ?

మరొకడు : ఆ ! ఏం చేయమంటారు ?

మొ. వా : అయితే వెంటనే ఓ పది రూపాయలు అప్పివ్వండి!

జి యల్ కాంతారావు (గుంటూరు)

ఆ రాత్రి ఇంజి అందమయిన కలలు కంటూ నిద్రపోయాడు

కాని సూర్యశేఖరం అన్న కుర్రవాడు చురుకయినవాడు గనుక సూపరింటెండెంట్‌గారు తన దరఖాస్తుమీద లిఖించిన 'ప్రశంసా' వాక్యాలను ఎట్లాగో పసిగట్టినవాడయి, మరుసటిరోజు అనగా మే అయిదవ తారీకు పొద్దున్న ఆఫీసుకు వెళ్లి వెళ్లగానే, 'నిన్నటి నా దరఖాస్తుకు ఈ నా విజ్ఞాపన కూడా జతపరచవలసినది' అంటూ సూపరింటెండెంట్ వారికో కాగితం ఇచ్చాడు

అందులో—'ఒకవేళ నేను ఆ పెద్ద ఉద్యోగానికి ఎన్నుకోబడితే, సూపరింటెండెంట్ వారి ఆఫీసులోని నా ఉద్యోగానికి రాజీనామా ఇవ్వ సంసిద్ధుడను' అని రాసిఉంది

["వహ్వా ! వహ్వా !" అని కరతాళధ్వని చేశాడు వాల్‌రస్ మీసాలు

మల్లయుద్ధం మంచి పట్టులోకి దిగినంత ఉత్సాహంగా ఉంది పురుషోత్తానికి సిగరెట్టు తాగి ఎనిమిది నిముషాలయిపోయిందన్న దారుణ సత్యాన్ని మరచిపోయి వింటున్నాడు డాక్టరు

చలపతి చెప్పుకుపోసాగాడు ]

"ఈ సూర్యశేఖరం చూశావా, ఎంతపని చేశాడో" అని ఫోన్‌మీద ఇంజికి చెప్పారు సూపరింటెండెంట్

ఇంజికి కాస్త ఇరుకున పడ్డట్లయింది

అయితేనేం, అన్ని జటిల సమస్యలకూ తిరుగులేని అస్త్రం తెలిసినవాడు గనుక దానిని ప్రయోగించాడు అప్పటికప్పుడు నిర్ణయించేసుకుని రాబోయే ఆదివారంనాడు తన ఇంట్లో జరగబోయే పార్టీకి సూపరింటెండెంట్‌గారిని పిలిచాడు పరంజ్యోతి గారినీ, గెయిక్వాడ్‌నూ, చోప్రానూ, బార్నెసునూ ఇంకో ఇద్దరు ముగ్గురినీ ఆహ్వానించాడు అందరూ సరే అన్నారు

సూర్యశేఖరం తన మానాన తాను ఇంట్లో కూచుని ఇంటర్‌వ్యూకి చదవసాగాడు ..

ఆదివారం వచ్చింది

పార్టీ రసకందాయంలో పడింది, జోరుగా సాగుతూంది

"ఇంటర్వ్యూ జూన్ ఇరవైయో తారీకునాడు ఉంటుందోయ్" అని ఇంజిని ప్రక్కకు పిలిచి చెప్పారు పరంజ్యోతి

"జూన్ ఇరవయ్యా ?" అని గడ్డం గోక్కున్నాడు ఇంజి

"ఏం, టైం చాలదా 'ప్రిపరేషన్' కూ ?" అన్నారు పరంజ్యోతి

ఆ జోక్‌కు తానూ నవ్వేసి చేతిలోని గ్లాసుని నౌకర్‌కు అందించేసి పలికాడు ఇంజి ఏదేమీ లేదు అదేదో డెలిగేషన్‌తో కెనడాకో కంబోడియాకో వెళ్లమన్నారు నన్ను జూన్ పదిహేడున బయలుదేరాలిట—"

"ఓసీ !" అని నిముషం పూర్తుకాని ఇంజి వీపు తట్టి—"ఓస్ ! అయితే దాన్దేం ఉంది, జూన్ పదిన ఏర్పాటు చేయిదాము సరేనా—" అన్నారు పరంజ్యోతి

"హా జూన్ పదయితే మంచిది మీకు చాలా థాంక్స్ !" అంటూ ఆయన చేతిలోని గ్లాసులోకి తన 'కృతజ్ఞత' ని పోశాడు ఇంజి అక్కడ నుండి కదిలాడు ముందు గదిలో గెయిక్వాడ్, బార్నెసుల అవసరాలు గమనించసాగాడు

రాత్రి పదకొండయింది

పరంజ్యోతి వెళ్ళబోతుంటే— "రాత్రికి ఇక్కడే వుండిపోరాదాండీ?"— అన్నాడు ఇంజి

"అబ్బే, లేదోయ్, నిన్ననే మా ఆవిడ గారినుండి ఉత్తరం వచ్చేసింది" అని దీనంగా చూశారు పరంజ్యోతి

ఇద్దరూ నవ్వారు.

బార్నెస్ సోఫామీద పడివున్నాడు. ఆయన సర్కారువారికో సలహాదారుడు ఒక రాయబారి బావమరది గెయిక్వాడ్ ఏకాంతంలోకి వెళ్ళిపోవడానికి సిద్ధంగా వున్నాడు చోప్రాకు 'వేవిళ్ళు' వచ్చాయి!

పరంజ్యోతికి టాటా చెప్పాడు ఇంజి.

జూన్ మూడవ తారీకున ఆఫీసులో తన గదిలో కూర్చున్న పరంజ్యోతిగారి గుండె అర నిముషం అల్లల్లాడింది 'ఉఫ్, ఎంతయినా తన క్రిందివాడు! అతనితో మాట్లాడ్డానికి భయమేమిటి'—అని అంతరాత్మను జోకొట్టి, టేబిల్‌మీద ఉన్న చీటీని ఇంకోసారి చూసి, కాలింగ్‌బెల్ నొక్కారు

బంట్రోతు రాగానే "ఇదిగో, ఈ చీటీ పంపిన ఆయన్ని లోపలికి రమ్మను" అన్నారు.

బంట్రోతు బయటికి వెళ్లగానే సూర్యశేఖరం లోపలికి వచ్చాడు

"నమస్కారం సార్ !" అన్నాడు

పరంజ్యోతిగారు చాల సీరియస్‌గా లావుపాటి రిపోర్టులో ఏదో గుర్తు పెట్టుకుంటున్నవారల్లా తల పైకెత్తి చూచి "నువ్వా—?" అన్నారు.

"సూపరింటెండెంట్ ఆఫీసులో ఎస్ ఎస్ ఒ నండి"

"ఏమిటి పని ?"

"జూన్ పదవ తారీఖున జే ఏ ఒ. ఉద్యోగం తాలూకు ఇంటర్వ్యూ ఉందండి అందుకు పిలిచిన వారిలో నేను లేనండి"

"అదెట్లా తెలుసు నీకు ?" అని అడిగారు పరంజ్యోతి

"ఇంటర్వ్యూకి రమ్మని నాకు తెలిసిన ఒకరిద్దరికి పిలుపు వచ్చిందండి కాని నాకు రాలేదు"

"అయితే ?"

"ఆ ఉద్యోగానికి కావాల్సిన అర్హతలన్నీ నాకున్నాయండి కనుక కనీసం ఇంటర్వ్యూ అయినా రావాలండి"

"ఆమాట నువ్వు కాదు, నీపై ఆఫీసర్లనాలి అదీకాక నువ్వు నన్ను చూడ్డానికి మీ ఆఫీసర్ అనుమతి తీసుకోవాలి తెలుసా ?" అని గొంతు హెచ్చించారు పరంజ్యోతి

"అనుమతి తీసుకునే వచ్చానండి !"

"అయినా ఆఫీసువేళలో వచ్చి నీ పనీ, నాపనీ పాడుచేసేవాడివి, నువ్వేం ఆఫీసరువయ్యా ?"

మరయితే సాయంకాలం ఆరింటికో లేక ఆదివారం పొద్దున్నో వస్తే మీరుండరుగా—అందామన్పించింది కాని, సూర్యశేఖరం ఆమాట అనలేదు

"సర్లే నువ్వెళ్లు చూస్తా !!"

"క్షమించండి సార్ ! థాంక్స్ సార్ !" అని వెళ్లిపోయాడు సూర్యశేఖరం

పరంజ్యోతి అర్జెంటుగా ఇంజితో మాట్లాడారు

"ఇంక లాభంలేదోయ్, అతడి పేరు చేర్చక తప్పదు—" అన్నారు

"అంతా మీ దయ" అన్నాడే కాని ఇంజి గుండెల్లో ఇంజన్లు పరుగెత్తాయి

ఇంటర్వ్యూకి తన్ను పిలిచే ఉత్తరం కోసం సూర్యశేఖరం కళ్లల్లో వత్తులు పెట్టుకొని ఎదురుచూశాడు

జూన్ ఎనిమిది, శనివారం సాయంకాలం వాళ్లాఫీసుకు సీలువేసిన కవర్ వచ్చింది అందులో 'ఆ' ఉత్తరం ఉందని సూర్యశేఖరానికి తెలుసు కాని ఆ కవర్‌ని చింపే అధికారం సూపరింటెండెంట్ వారిది ఆ ఉత్తరంమీద సంతకంపెట్టి సూపరింటెండెంట్‌గారే ఇవ్వాలి తన చేతికి కాని ఆ కవర్ వచ్చేసరికి ఆయన ఆఫీసులో లేరు రాత్రి ఎనిమిదింటిదాక కూర్చున్నాడు, సూర్యశేఖరం కాని సూపరింటెండెంట్‌వారు దయచేయలేదు

—అదే సమయానికి సినిమా థియేటర్‌లో ఇంటర్వెల్ వేళయింది తమ మధ్యగా కూర్చున్న శశికళ మీదుగా వాలి ఇంజితో "పాపం, పసివాడు!" అని నవ్వారు సూపరింటెండెంట్

"ఎల్లుండి ఇంటర్వ్యూ ! రేపేమో ఆదివారం!! భలే" అని వికటాట్టహాసం చేసినవాడు ఇంజి.

"ఎల్లుండి నేను ఆఫీసుకు సెలవు పెడ్తున్నా" అని ప్రకటించారు సూపరింటెండెంట్.

"అమోఘం !" అని శశికళ వీపు తట్టాడు

# రెండురెక్కలవాడు

దామె ఆమె ఎడమచేతి మీది సూపరింటెండెంటుగారి చేయి బరువెక్కింది దీపాలు ఆరాయి. సినిమా మళ్లీ మొదలయింది

—సోమవారం పొద్దున అనగా ఇంటర్వ్యూ రోజున ఆఫీసుకు వెళ్లి అక్కడ సూపరింటెండెంట్‌గారు లేకపోవడం చూచిన సూర్యశేఖరం పరంజ్యోతిగారికి ఫోన్‌చేసి, ఆయనగారి గర్జనలూ మూలుగులూ విని, ఆఖరుకు సూపరింటెండెంట్ గారి టేబిల్‌మీద— పెద్ద దొర శ్రీ పరంజ్యోతి గారి ఆదేశానుసారం తానాపూట ఇంటర్వ్యూకు వెళ్తున్నట్టు, ఉత్తరం రాసిపెట్టి హుటాహుటిని టాక్సీలో పడి ఇంటర్వ్యూ ఆరంభమవడానికి అయిదే అయిదు నిమిషాలుందనగా ఆ చోటును చేరినవాడాయెను !

["బ్రేవో!" అని చప్పట్లు కొట్టారు పురుషోత్తమూ, డాక్టరూ

"ఆరంభింపరు నీచ మానవుల్—" అని భర్తృహరి సుభాషితాన్ని పాడ నారంభించాడు వాల్‌రస్ మీసాలు కాని చలపతి అడ్డంపడ్డాడు కథతో ]

"ఆ ఇంటర్వ్యూకు వచ్చిన అయిదుగురిలో ముగ్గురు ఎందుకూ కొరగానివారు ఒకతడు రిటైరవడానికి ఆర్నెలలు బాకీ ఉన్నాయి ఇంకొకతడు ఉద్యోగానికి సంబంధించిన అర్హతలు లేనివాడు మూడవ వ్యక్తి అడిగినవాటికి సమాధానా లివ్వని దిష్టిబొమ్మ పోతే ఇహ ఇంజీ, సూర్యశేఖరమూ మిగిలారు

ఇంటర్వ్యూ ముగిసింది !

ఆ రాత్రే ఇంజి తన ఇంట్లో ఘనాతి ఘనమూ, ద్రవాతి ద్రవమూ అయిన పార్టీ నిచ్చాడు అందరూ వచ్చి ఆనందాన్ని గ్లాసుల్లో పోసుకు తాగారు ! అందం నడుము చుట్టూ చేతులు వేశారు అక్కడికి వినాయకరావూ వచ్చారు, లిల్లీ రోజాని చూసి నాయిక రాజయిపోయారు !

మానవసాధ్యమైన ప్రయత్నం చేసిన సూర్యశేఖరం నిశ్చింతగా పడుకుని నిద్రపోయాడు

అయిదు రోజుల తర్వాత ఇంజి చేతికి ఆర్డరు వచ్చింది అతడు కొత్త పదవిని అలంకరించాడు అతడి జీతం పంద్రెండు వంద లయింది !"

—అని ముగించాడు చలపతి !

సభ్యులందరూ గొల్లున శబాసు గొంతులోన్ని నల్లజెండాలతో

"దారుణం!" అన్నాడు పురుషోత్తం.

"నాన్సెన్స్ ! సూర్యశేఖరం సుప్రీంకోర్టుకు వెళ్లాలి !" అని హుంకరించాడు డాక్టరు.

"చేతికి కాగితం రాకముందే అతడికి ఫలితం ఎట్లా తెలిసింది ?" అని గోల పెట్టాడు కంసుడు

"కావలసిన అర్హతలున్నవాడుండగా బొత్తిగా అర్హతలు లేనివాడు ఎట్లా ఎన్నిక అయ్యాడు ?" అని పునాదిరాయివంటి ప్రశ్న వేశాడువాల్‌రస్‌మీసాలు.

ఈ కుర్రసంత నంతా ఓపికగా భరించాడు చలపతి కాస్త సద్దు మణిగాక చెప్పాడు "మీరందరూ రెండు పనులు చెయ్యాలి ఒకటి, తక్షణమే ఐసు వేసుకుని నిమ్మరసం త్రాగాలి. రెండు, మీ ఆలోచనలు రెండు దశాబ్దాల వెనకపడి ఉన్నాయిని తెలుసుకోవాలి ఇహ అసలు విషయం . అర్హత లున్నాయా లేదా నిర్ణయించేది ఆ బాధ్యతగల కమిటీవారు. వారు నిర్ణయించిన తర్వాత సుప్రీంకోర్టువారే గాదు శ్రీమన్నారాయణుడైనా ఏమీ అనబోడు"

"అయినా ఇంతటి ఘోరం ." అంటూ ఆరంభించిన కంసుడికి ఆగమని సంజ్ఞచేసి ఇంకా చెప్పాడు చలపతి "ఆ కమిటీకి వినాయకరావ్ అధ్యక్షులనీ , గెయిక్వాడ్ బార్నెసులు సభ్యులని తెలిస్తే మీరింత గొడవపడరు"

అందరూ మళ్లీ నెత్తిన నోరు పెట్టుకొని అరిచారు ఆశ్చర్యపడ్డారు

"మధ్య, రెండు రెక్క లేవిటి ?" అన్నాడు పురుషోత్తం కథారంభానికి వస్తూ,


"మద్యమూ మదవతీ—"

"అయితే మరీ, 'మమ' అనుకుని కార్యరంగంలోకి దూకుతాడందూ ?" అన్న కంసుడిని మెచ్చుకుంటున్నట్లు చూశాడు చలపతి

"అయినా సరే, అతడు సుప్రీంకోర్టుకు వెళ్లి ఉండాలి—" అన్నాడు డాక్టరు మళ్లీ

"సూర్యశేఖరం సుప్రీంకోర్టుకు వెళ్లలేదు గాని స్వీడన్ వెళ్లాడు అక్కడ స్థిరపడిపోయాడు" అని తెలిపాడు చలపతి

శ్రోతలా పూటకు పీతను మరిచారు ! ★



"మీలాంటి పెద్దలు మామూలు పుస్తకాలమీద ఆటోగ్రాఫ్ వెయ్యటమేమిటి ! ఈ చెక్‌మీద